క్లుప్తంగా

నేడు పెన్షనర్ సంఘ భవనంలో వైద్యశిబిరం

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాకేంద్రంలోని పెన్షనర్ల భవనంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం గ్లోబల్ సూపర్ స్పెషాలిటీ హైదరాబాద్ ఆధ్వర్యంలో శుక్రవారం కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంసీ లింగన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటలకు ప్రారంభమయ్యే శిబిరాన్ని పెన్షనర్లు, వారి కుటుంబసభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కంటి పరీక్షల అనంతరం అవసరమైన వారికి ఆపరేషన్లు ఉచితంగా చేయబడుతాయని పేర్కొన్నారు.

నిర్మల్ ఆర్డీవో పరిశీలన



పత్రాలు పరిశీలిస్తున్న ఆర్డీవో రత్నకల్యాణి

మామడ: మండలకేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎన్నికల నిర్వహణను నిర్మల్ ఆర్డీవో రత్నకల్యాణి గురువారం పరిశీలించారు. నామినేషన్ల వివరాలను రిటర్నింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుశీల్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌రావు ఉన్నారు.

ఎన్నికలు నిర్వహించాలి



వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

కుంటాల: స్థానిక సంస్థల ఎన్నికల విషయమై హైకోర్టు స్టే విధించడం బాధాకరమని.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని కుంటాల గ్రామస్తులు డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ కమల్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు అవకాశం కల్పించాలని వినతిపత్రంలో కోరారు. మాజీ సర్పంచ్ సమత, వెంకటేశ్, లక్ష్మణ్, అనిల్, రమేశ్, సాయన్న, ప్రశాంత్, నరేశ్, రామ్మోహన్ తదితరులు ఉన్నారు.

బైక్‌ల చోరీకి యత్నం

తానూరు: మండలకేంద్రంలో బుధవారం అర్ధరాత్రి ఓ ఇంటి ముందు నిలిపి ఉన్న రెండు బైక్‌లను ఎత్తుకెళ్లేందుకు దుండగులు యత్నించారని ఎస్సై షేక్ జుబేర్ ఓ ప్రకటనలో తెలిపారు. వడ్గాం మార్గంలో వెళ్తుండగా పోలీసుల వాహనం గమనించి బైక్‌లు వదిలి దొంగలు పారిపోయారని ఎస్సై పేర్కొన్నారు.

రేషన్ దుకాణాలు తనిఖీ



పార్‌పెల్లిలో తనిఖీ చేస్తున్న అధికారులు

లక్ష్మణచాంద: మండలంలోని పలు రేషన్ దుకాణాలను టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ శేఖర్‌రెడ్డి గురువారం తనిఖీ చేశారు. మండలంలోని కనకాపూర్, వడ్యాల్‌లో 2, రాచాపూర్, ధర్మారం, పార్‌పెల్లి గ్రామాల్లోని రేషన్ దుకాణాలను టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సంయుక్తంగా తనిఖీ చేశారు. వడ్యాల్‌లో రేషన్ షాప్ మూసి ఉండటంతో డీలర్‌కు ఫోన్ చేశారు. స్పందించక పోవడంతో ఆర్డీవోకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలి పారు. దుకాణాల్లో నిల్వలు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఇందులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ కార్తీక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కళ్లను కాపాడుకోవాలి




కంటి అద్దాలు అందిస్తున్న వైద్యులు

ముధోల్: కంటి సమస్యలు తలెత్తకుండా కళ్లను కాపాడుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో గంగాధర్ అన్నారు. గురువారం ప్రపంచ దృష్టి దినోత్సవం పురస్కరించుకొని ముధోల్ ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రిలో అవగాహన కల్పించారు. ఆశవర్కర్లకు పరీక్షలు చేసి కంటి అద్దాలను పంపిణీ చేశారు. వైద్యులు ఆకాశ్, సోని థామస్, రవి, రంగనాథ్, షానవాజ్ ఖురేశీ, నిరంజన్‌కుమార్, అక్షయ్‌కుమార్, నరేశ్‌రావు, సందీప్‌రావు, శ్రీకాంత్, సాయన్న తదితరులు ఉన్నారు.

ఈ-కేవైసీ పూర్తిచేయాలి

తానూరు: ఉపాధి కూలీల ఈ-కేవైసీ నమోదు ప్రక్రియ సత్వరం పూర్తిచేయాలని ఈజీఎస్ ఏపీవో శివలింగం సిబ్బందికి సూచించారు. గురువారం మండలంలోని జౌలా(కే)లో ఈకేవైసీ ప్రక్రియను పరిశీలించారు. ఇతర గ్రామాలకు వలస వెళ్లిన వారికి సమాచారమివ్వాలన్నారు. ఈకేవైసీ నమోదు చేయించుకోకుంటే కూలీ డబ్బులు రావని ఏపీవో పేర్కొన్నారు. టీఏ ప్రసాద్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

పత్తి రైతు దిగాలు..



ముధోల్: భారీవర్షాలు పత్తి రైతులను నట్టేట ముంచుతున్నాయి. ముధోల్ మండలవ్యాప్తంగా 6,300 ఎకరాల్లో రైతులు పత్తి పంట సాగు చేశారు. పూత, కాత దశలో కురిసిన వానలకు ఇప్పటికే నష్టం వాటిల్లగా.. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు చేనులోని మొక్కలు ఎర్రబడి పత్తికాయలు కుళ్లిపోతున్నాయి. కనీస దిగుబడులు వచ్చేలా లేవని కర్షకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అలుగు నీటితో అవస్థలు



లోకేశ్వరం: మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణ రాజులకుంట చెరువు అలుగు నీటితో నిండుతోంది. దీంతో విద్యార్థులు తరగతి గదులకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు మొరం పోయించి బడి ఆవరణలోకి నీరు రాకుండా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నమ్మండి.. ఇది ఆటస్థలమే



ఇదేదో బురదకుంట అనుకుంటే పొరపాటే. నిర్మల్‌రూరల్ మండలం కొండాపూర్‌లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణమిది. గ్రామ చెరువు సమీపంలో పశువులను ఉంచే ప్రదేశంలో ఏర్పాటు చేయడంతో పరిసరాలు అధ్వానంగా మారాయి. తీవ్ర దుర్గంధం వెదజల్లుతుండటంతో ఇక్కడకు వచ్చేందుకు ఎవరూ ఆసక్తి కనబర్చడం లేదు. అధికారులు ఆటస్థలాన్ని వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

సర్కారు బడిలో సమస్యలు

- నర్సాపూర్(జి) జెడ్పీహెచ్‌ఎస్‌లో సౌకర్యాలు కరువు
- పునాది దశలోనే గదుల నిర్మాణం
- తాగునీరు, మూత్రశాలలు లేక విద్యార్థులకు అవస్థలు



బడిలో 380 మంది బాలురు ఉన్నా.. వారికి ఒక్క మూత్రశాల, మరుగుదొడ్డి లేదు. దీంతో రేకులచాటున, బయట చెట్లపొదల్లోకి వెళ్లి మూత్ర విసర్జన చేస్తూ విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.



పునాది దశలోనే గదుల నిర్మాణ పనులు



డైనింగ్‌హాల్ లేకపోవడంతో చెట్ల నీడన మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

నర్సాపూర్(జి): ప్రైవేటుకు ధీటుగా సర్కారు బడుల్లో సౌకర్యాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నామని పాలకులు, అధికారులు పేర్కొంటున్నారు. క్షేత్రస్థాయిలో మాత్రం పలు పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. నర్సాపూర్(జి) మండలకేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో మరుగుదొడ్లు, తాగునీరు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై కథనం..

567 మంది విద్యార్థులు..

నర్సాపూర్ (జి) జెడ్పీహెచ్‌ఎస్‌లో ప్రస్తుతం 567 మంది విద్యార్థులు చదువుతుండగా.. వీరిలో బాలురు 380 మంది కాగా.. బాలికలు 187 మంది. 25 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఈ పాఠశాలలో చదువు పూర్తి చేసిన విద్యార్థులు ఎందరో ఉన్నత స్థానాలకు ఎదిగారు. కానీ ప్రస్తుతం ఈ పాఠశాలలో బాలురకు మరుగుదొడ్లు, మూత్రశాలలు లేవు. ఒంటికి, రెంటికి వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. తాగునీటి వసతి, డైనింగ్ హాల్ లేదు.

పునాది దశలోనే పనులు

శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనం గదులు తొలగించి వాటి స్థానంలో 6 గదులు, డైనింగ్‌హాల్ నిర్మాణానికి 2023లో అప్పటి ప్రభుత్వం మన ఊరు-మన బడి కార్యక్రమం కింద రూ.94 లక్షలు మంజూరు చేసింది. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు ప్రారంభించగా బిల్లులు రాక పునాది దశలోనే పనులు నిలిచిపోయాయి. సరిపడా గదులు లేకపోవడంతో ఒక్కో తరగతిలో ఎక్కువ మంది విద్యార్థులు కూర్చుంటూ ఇబ్బంది పడుతున్నారు.

ఇరుకు గదుల్లోనే పాఠాలు..

ప్రస్తుతం పాఠశాలలో 11 తరగతి గదులు ఉండగా.. ఒక్క తొమ్మిదో తరగతిలోనే మూడు సెక్షన్లు ఉన్నాయి. గదుల్లేక కంప్యూటర్‌ల్యాబ్, ఎన్‌సీసీ, సైన్సు, సోషల్ ల్యాబ్‌తోపాటు మిగతా తరగతులకు సెక్షన్లు ఏర్పాటు చేయడం లేదని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. విద్యార్థులను ఆరుబయట కూర్చొబెట్టి.. స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంల సమావేశం నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది.

చెట్ల నీడన మధ్యాహ్న భోజనం...

పాఠశాలలో డైనింగ్ హాల్ లేకపోవడంతో విద్యార్థులు చెట్ల నీడన, వరండాల్లో కూర్చొని మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. తాగునీటి సౌకర్యం లేక ఇంటి నుంచి నీటిని బాటిళ్లలో తెచ్చుకుంటున్నారు. మరికొందరు బోరు బావి నీటినే తాగుతున్నారు.

దాతలు ముందుకు రావాలి

పాఠశాలలో సౌకర్యాలు కల్పించేందుకు పూర్వ విద్యార్థులు, దాతలు ముందుకు రావాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయించి నీటి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

డైనింగ్‌హాల్ నిర్మించాలి



మా పాఠశాలలో డైనింగ్‌హాల్ లేకపోవడంతో చెట్ల నీడన, వరండాలో కూర్చొని మధ్యాహ్న భోజనం చేస్తున్నాం. వర్షం కురిసిన రోజు భోజనం చేయడం అసౌకర్యంగా ఉంటుంది. డైనింగ్ హాల్ నిర్మిస్తే సౌకర్యంగా ఉంటుంది.

– వైష్ణవి, పదో తరగతి

ముక్కు మూసుకుంటున్నాం..



పాఠశాలలో మూత్రశాలలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. పరిసరాలు దుర్గంధంగా మారడంతో ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. మూత్రశాలలు నిర్మించేలా చూడాలి.

– చౌహాన్ సతీశ్‌కుమార్, తొమ్మిదో తరగతి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా..

పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాను. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూస్తాను.

– రవీంద్రకుమార్, హెచ్‌ఎం

కాల్వ గట్టుపై ట్రాక్టర్ బోల్తా



బోల్తాపడిన ట్రాక్టర్

భైంసాటౌన్: పట్టణంలోని భైంసా-బాసర మార్గంలో వాలేగాం వెళ్లే దారిలో గడ్డెన్నవాగు ప్రాజెక్ట్ కాల్వగట్టుపై గురువారం ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. కాలువ నిర్వహణ, గట్టుకు పలుచోట్ల గండ్లు పడి అధ్వానంగా మారింది. ఈ విషయమై పలుమార్లు 'సాక్షి' కథనాలు ప్రచురించింది. అయినప్పటికీ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. దీంతో ద్విచక్రవాహనదారులు, పొలాలకు వెళ్లే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం పంట కోతల సమయం కావడంతో రైతులు ట్రాక్టర్లలో సోయా పంటను తరలిస్తున్నారు. ప్రమాదాలు జరగకుండా కాలువ గట్లకు మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు.

మత్తు పదార్థాలకు దూరం ఉండాలి



మాట్లాడుతున్న ఎస్సై శ్రీనివాస్

లక్ష్మణచాంద: మత్తు పదార్థాలకు దూరం ఉండి.. కష్టపడి చదువుకోవాలని ఎస్సై శ్రీనివాస్ విద్యార్థులకు సూచించారు. గురువారం లక్ష్మణచాంద ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మిషన్ పరివర్తన్-నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. మా దక ద్రవ్యాల వినియోగంతో దుష్పరిణామాలు, వి ద్యార్థుల భవిష్యత్తుపై వాటి ప్రభావం వివరించా రు. మత్తు పదార్థాలు ఆరోగ్యాన్ని, కుటుంబాన్ని, సామాజిక సంబంధాలను నాశనం చేస్తాయన్నారు. నషా ముక్త్ భారత్ అభియాన్ జిల్లా మేనేజర్ శ్రీనివాస్, ఇన్‌చార్జి హెచ్‌ఎం హరిప్రసాద్, ఉపాధ్యాయులు అశోక్, హంసలత, వినోద్‌బాబు, శ్రీపాద్ తదితరులు పాల్గొన్నారు.

'ఇచ్చిన హామీలపై నిలదీయండి'



కుభీర్‌లో బాకీకార్డులు అందిస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

కుభీర్: కాంగ్రెస్ విస్మరించిన హామీలను గుర్తు చేస్తూ గురువారం కుభీర్‌లో బీఆర్‌ఎస్ నాయకులు బాకీకార్డులను పంపిణీ చేశారు. బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కిరణ్ కొమ్రెవార్ మాట్లాడుతూ బూటకపు హామీలు ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని ప్రజలకు వివరించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అనిల్, మాజీ ఎంపీటీసీలు దేవిదాస్, విఠల్, నాయకులు డి.లింగన్న తదితరులు ఉన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

భైంసాటౌన్: ఎన్నికల వేళ కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయడంలో విఫలమైందని బీఆర్‌ఎస్ నియోజకవర్గ సమన్వయకర్త విలాస్ గాదేవార్ అన్నారు. గురువారం పట్టణంలో బీఆర్‌ఎస్ నాయకులు బాకీకార్డులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిన హామీలను గుర్తు చేస్తూ బాకీ కార్డులను ఇంటింటికి వెళ్లి ప్రజలకు అందించారు. కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి తిరిగి రావడం ఖాయమని పేర్కొన్నారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

డీఈఓను కలిసిన నాయకులు



డీఈఓ భోజన్నకు పూలమొక్క అందిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

నిర్మల్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌ను పునరుద్ధరించడంపై హర్షిస్తూ జిల్లాలోని పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు గురువారం డీఈవో భోజన్నను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కౌన్సిల్ నిబంధనలు చర్చించారు. కౌన్సిల్‌కు చైర్మన్‌గా వ్యవహరించే కలెక్టర్ సమక్షంలో సమావేశం ఏర్పాటు చేయించాలని కోరారు. జిల్లాలో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ శాశ్వత సభ్యత్వంలో పీఆర్టీయూ, ఎస్టీయూ, టీఎస్‌యూటీఎఫ్, టీఆర్టీఎఫ్.. రొటేషన్ పద్ధతిలో తపస్ సంఘం సభ్యత్వం కలిగి ఉన్నాయన్నారు. అధికారిక కార్యక్రమాలకు, జిల్లా విద్యావ్యవస్థకు సంబంధించి ముఖ్య అంశాలు చర్చించేందుకు ఈ సంఘాలు పాల్గొంటాయని పేర్కొన్నారు. ఇందులో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు నరేంద్రబాబు, రమణారావు, భూమన్నయాదవ్, లక్ష్మణ్, దాసరి శంకర్, పెంట అశోక్, దర్శనం దేవేందర్, భూమన్న తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్ ఎమ్మెల్యే సమీక్ష



ఎమ్మెల్యే బొజ్జుతో కాంగ్రెస్ నాయకులు

కడెం: మండలంలోని కొండుకూర్ గ్రామ ఫంక్షన్ హాల్‌లో గురువారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ స్థానికసంస్థల ఎన్నికలపై కాంగ్రెస్ నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలని సూచించినట్లు సమాచారం. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ భూషణ్, మండలాధ్యక్షుడు మల్లేశ్, నాయకులు సతీశ్‌రెడ్డి, మల్లేశ్‌యాదవ్, సలీం, శ్రీనివాస్, భూమేశ్ తదితరులు ఉన్నారు.

హిందువుల ఐక్యతకు పంచ పరివర్తన్



అనంతపేట్‌లో వేడుకలో పాల్గొన్న సేవకులు

సోన్: హిందువుల ఐక్యతకు పంచ పరివర్తన్ కృషి చేస్తోందని జిల్లా శారీరక్ ప్రముఖ్ రాంపూర్ హన్మాండ్లు అన్నారు. గురువారం సోన్‌లో ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య వక్తగా హాజరై మాట్లాడారు. సామాజిక సామరస్యత, కుటుంబ జీవన విలువలు, స్వఆధారిత జీవనం, పర్యావరణ పరిరక్షణ, పౌర విధులు ప్రతి కుటుంబంలో పాటించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఖండ శారీరక్ ప్రముఖ్ ముఖేశ్, ఖండ బౌద్ధిక్ ప్రముఖ్ వినోద్, స్వయంసేవకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మామడ: మండలంలోని అనంతపేట్‌లో ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో గురువారం విజయదశమి నిర్వహించారు. హిందువుల ఐక్యతకు పంచపరివర్తన్ ద్వారా ఆర్‌ఎస్‌ఎస్ కృషి చేస్తుందని బౌద్ధిక్ ప్రముఖ్ సాడిగే హరికృష్ణ అన్నారు.ఖండకార్యవాహ ఆకారపు చిన్నయ్య,స్వయం సేవకులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



మక్కలు పరిశీలిస్తున్న శ్యాంసుందర్, నేతలు

లోకేశ్వరం: ప్రభుత్వం మొక్కజొన్న పంట కొనుగోలుకు కేంద్రాలు ఏర్పాటు చేయాలని జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని నగర్‌తండాలో మక్కలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. రైతులు తమ పంటను తక్కువ ధరకు దళారులకు అమ్ముకొని నష్టపోతున్నారని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ శ్యాంసుందర్, నాయకులు ప్రశాంత్, సందీప్, అనిల్, ప్రవీణ్, భోజారెడ్డి, వేణుపటేల్, రమేశ్ ఉన్నారు.

'గ్రామాభ్యుదయ ఆస్తుల అమ్మకం నిలిపేయాలి'

భైంసాటౌన్: ముధోల్‌లోని గ్రామాభ్యుదయ స్వచ్ఛంద సంస్థ ఆస్తుల అమ్మకం నిలిపేయాలని దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బురుగుల రాజు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో సబ్ కలెక్టర్ అజ్మీర సంకేత్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముధోల్‌లోని సర్వే నంబర్ 431/ఆ, 431/అలోని భూ మిని యాజమాన్యం స్వప్రయోజనాలకు విక్రయించేందుకు యత్నిస్తున్నట్లు ఆరోపించారు. దివ్యాంగుల ప్రయోజనాల దృష్ట్యా స్వచ్ఛంద సంస్థ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు భోజారెడ్డి, మహేశ్, లక్ష్మి, జనసేన నాయకుడు మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

అర్థమయ్యేలా పాఠాలు బోధించాలి

కుంటాల: విద్యార్థులకు అర్థమయ్యే విధంగా పాఠాలు బోధించాలని ఎంఈవో ముత్యం పే ర్కొన్నారు. గురువారం కల్లూరు కేజీబీవీని సందర్శించారు. విద్యార్థుల విద్యాసామర్థ్యాలు పరిశీలించి సందేహాలను నివృత్తి చేశారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచే శారు. ఎస్‌ఓ సువర్ణ, సిబ్బంది పాల్గొన్నారు

సరుకులు అందజేత

లోకేశ్వరం: మండలకేంద్రానికి చెందిన స్వరూప-శివకృష్ణ దంపతుల కుమారుడు గురుచరణ్ పుట్టినరోజు వేడుకలను భైంసా శ్రీవివేకానంద ఆవాసంలో గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా రూ.మూడు వేల విలువైన నిత్యావసర సరుకులను విరాళంగా ఆవాసానికి అందజేశారు. కార్యక్రమంలో ఆవాసం ప్రతినిధులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

దుబాయిలో బతుకమ్మ సంబరాలు

నిర్మల్‌ఖిల్లా: దుబాయ్‌లో గురువారం సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. జిల్లావాసులు పలువురు ఉపాధి నిమిత్తం యూఏఈలోని దుబాయ్ షార్జా అబుదాబి తదితర ప్రాంతాల్లో స్థిరపడ్డారు. దుబాయ్‌లోని వుడ్‌లెమ్ స్కూల్ కాన్ఫరెన్స్ ఇండోర్ హాల్‌లో తెలంగాణ ప్రాంత సంఘాల ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో నిర్మల్‌లోని ఇందిరానగర్ కాలనీవాసి దరావస్తు సింధూరి-వంశీ దంపతులతోపాటు పలువురు జిల్లా వాసులు పాల్గొన్నారు.

'అర్హులకే ఇళ్లను కేటాయించాలి'

ఖానాపూర్: ఇందిరమ్మ ఇళ్లను అర్హులకే కేటాయించాలని బహుజన కమ్యూనిస్ట్ పార్టీ రాష్ట్ర నాయకుడు పసుపుల వెంకన్న డిమాండ్ చేశారు. గురువారం ఖానాపూర్‌లో విలేకరులతో మాట్లాడారు. లబ్ధిదారుల ఎంపికలో పలు చోట్ల ఇందిరమ్మ కమిటీ సభ్యులు, అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండటంతో పేదలు నష్టపోతున్నారని పేర్కొన్నారు.

నాయకుడికి పరామర్శ

ఖానాపూర్: మండలంలోని బీర్నంది గ్రామానికి చెందిన బీజేపీ మండల మాజీ ఉపాధ్యక్షుడు ఎనగందుల రవిపై ఇటీవల కొందరు దాడి చేయడంతో గాయపడ్డారు. ఈ విషయం తెలిసి బీజేపీ నాయకులు అజ్మీరా హరినాయక్, పడాల రాజశేఖర్.. అతడి ఇంటికి వెళ్లి రవిని పరామర్శించారు. దాడికి పాల్పడ్డ వారిపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు టేకు ప్రకాశ్, కొడిమ్యాల లక్ష్మణ్, పెద్ది రమేశ్, బుర్ర రాముగౌడ్ తదితరులు ఉన్నారు.